పగులుతున్న పైపులు..
తాగునీటికి తంటాలు


మూడు రోజుల క్రితం బుల్కాపూర్ వద్ద పగిలిన పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

మణికొండ: వేసవిలో ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాల్సిన అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎలాంటి చర్యలు చేపట్టక పోవడంతో ప్రజలు దాహంతో విలవిల లాడుతున్నారు. అపార్ట్‌మెంట్లలోని బోర్లలో నీరు తక్కువ కావడంతో జలమండలి నుంచి సరఫరా చేస్తున్న అరకొర నీటితో నెట్టుకొద్దామనుకుంటే అదీ సాధ్యం కావటం లేదు. వారంలో ఓ రోజు పైప్‌లైన్ పగిలిపోయిందని, నాలుగు రోజుల పాటు సరఫరాను నిలిపివేస్తున్నారు. ఇక పేదలు నివసించే ప్రాంతాల్లో సంప్‌లు లేకపోవటం, ఇరుకు కాలనీల్లోకి ట్యాంకర్లు వచ్చే పరిస్థితి లేకపోవటంతో నానా ఇక్కట్లకు గురవుతున్నామని వాపోతున్నారు. గండిపేట మండల పరిధిలోని మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలతో పాటు బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌ల పరిధిలో నీటికి తీవ్ర కటకట ఏర్పడింది. ఫిబ్రవరి మాసంలోనే ఏకంగా నాలుగుసార్లు పైపులు పగిలిపోయాయనే కారణంతో రెండు, మూడు రోజులు సరఫరాలను నిలిపివేశారు.పైప్‌లైన్‌లను పునరుద్ధరించాక అన్ని కాలనీలకు సరఫరా వ్యవస్థ బాగుపడక ముందే మరోసారి పగిలిపోతున్నాయి. దాంతో కొన్ని కాలనీలు, బస్తీలకు వారం రోజులైనా నీటి సరఫరా జరగకపోవటంతో అక్కడి ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు.

మున్సిపాలిటీల్లో నీటి కటకట
- పైపులైన్లపై నుంచి రాకపోకలు సాగిస్తున్న భారీ వాహనాలు
- నీరందక ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

పైప్‌లైన్లపై నుంచి రోడ్లు...

మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలకు మంజీరా ప్రాజెక్టు నుంచి ఖానాపూర్, షేక్‌పేట రిజర్వాయర్‌ల ద్వారా మంచినీరు సరఫరా అవుతుంది.ప్రాజెక్టు నుంచి ఖానాపూర్ రిజర్వాయర్‌కు, అక్కడి నుంచి షేక్‌పేట రిజర్వాయర్‌కు వచ్చే పైప్‌లైన్ పై నుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. జంట మున్సిపాలిటీలతో పాటు శంకర్‌పల్లి మండల పరిధిలోను భారీ నిర్మాణాలు జరుగుతుండటం, వాటికి మెటీరియల్‌ను సరఫరా చేస్తున్న భారీ లోడు వాహనాలు వాటిపై నుంచి తిరుగుతుండటంతో పైపులపై భారం పడి అవి పగిలిపోతున్నాయని జలమండలి ట్రాన్స్‌మిషన్ విభాగం ఉద్యోగి ఒకరు తెలిపారు. పైప్‌లైన్ల పైనుంచి వాటి రాకపోకలను నివారిస్తేనే అవి పగలకుండా సకాలంలో నీటి సరఫరా జరుగుతుందని పేర్కొన్నారు. ఆ దిశగా జలమండలి ఉన్నతాధికారులు ఆలోచన చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దండుకుంటున్న ప్రైవేటు ట్యాంకర్లు..

జలమండలి నుంచి రోజుల తరబడి నీటి సరఫరా నిలిచిపోవటం, వారి తరపున ట్యాంకర్ల సరఫరా సైతం జరగకపోవటంతో ప్రజలు తప్పనిసరి ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. వారికి డిమాండ్ పెరిగిపోవటంతో ఇష్టానుసారంగా ఒక్కో ట్యాంకర్‌కు రూ. 900 నుంచి రూ.2 వేల వరకు దండుకుంటున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా నీటి వ్యాపారం చేస్తున్న అలాంటి వారితో మున్సిపాలిటీ అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసి నిర్ణీత ధరను ప్రకటించి అంతే తీసుకునేలా చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

బస్తీలకు ఉచిత ట్యాంకర్లు పెట్టాలి..



పేదలు నివసిస్తున్న బస్తీలకు నీటి సరఫరా జరగని రోజుల్లో మున్సిపాలిటీ, జలమండలి తరపున ఉచిత ట్యాంకర్లను ఏర్పాటు చేయాలి. నీటిని నిలువ చేసుకునే సంప్‌లు లేకపోవటం, ట్యాంకర్లు ఇంటి వరకు వచ్చే రోడ్లు లేకపోవటం పెద్ద సమస్యగా మారింది. అలాంటి వారికి వారం రోజుల పాటు నీటిని సరఫరా జరగగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా రోజు విడిచి రోజు నీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టాలి.

– నరేష్, మణికొండ క్వార్టర్స్ అధ్యక్షుడు

నాలుగు రోజులుగా సరఫరా లేదు..



ఫిబ్రవరి మాసంలో వారంలో ఓ రోజు పైప్‌లైన్ పగిలిపోయిందనే కారణంతో నాలుగు రోజులుగా నీటి సరఫరా చేయటం లేదు. పాత గ్రామాలలో ట్యాంకర్లు వచ్చే అవకాశం లేదు. వారికి సంప్‌లు అంతంత మాత్రంగానే ఉంటాయి. కాలనీల్లోనూ బోర్లు వట్టిపోవటంతో నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పైప్‌లైన్ పగిలితే వెంటనే మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

– శ్వేత రవికాంత్‌రెడ్డి, కౌన్సిలర్ మణికొండ గ్రామం

సరఫరా పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం..

సింగూరు నుంచి వచ్చే నీటి పైప్‌లైన్లు పగలటంతో సరఫరా నిలిచిపోతోంది. దశాబ్దాల క్రితం వేసిన పైపులు కావటం, నీటిని పెంచి తీసుకోవటం, విద్యుత్ సరఫరా అకస్మాత్తుగా నిలిచిపోవటంతో పైపులు పగులుతున్నాయి. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలకు ప్రస్తుతం 7, 8 ఎంజీడీ నీరు వస్తోంది దాన్ని 10 ఎంజీడీలకు పెంచాలని, మణికొండలో ఉన్న గండిపేట నీటి రెండు ఫిల్టర్లను ఉపయోగించి ఆ నీటిని జంట మున్సిపాలిటీలకు సరఫరా చేయాలని ప్రతిపాదనలు పంపాం. బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రస్తుతం 3.5 ఎంజీడీ నీరు వస్తోంది. అదనంగా మరో రెండు ఎంజీడీల నీటిని ఇవ్వాలని కోరాం. కృష్ణా నీటిని అదనపు పంపింగ్ చేసే ఏర్పాట్లు జరుగుతున్నాయి. వారం రోజుల్లో పరిస్థితి సర్దుకుంటోంది.

-వీరేందర్‌రెడ్డి, జనరల్ మేనేజర్, జలమండలి

ఉచితంగా నీటిని సరఫరా చేయాలి


మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన కౌన్సిలర్, క్వార్టర్స్ వాసులు

మణికొండ: పేదలు నివసించే బస్తీల్లో రెండు ట్యాంకర్లను ఏర్పాటు చేసి ఉచితంగా నీటిని సరఫరా చేయాలని 16వ వార్డు కౌన్సిలర్ శైలజ వినోద్ మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్‌ను కోరారు. గురువారం ఆమె ఆధ్వర్యంలో మణికొండ క్వార్టర్స్ కాలనీవాసులు జలమండలి మేనేజర్ స్ఫూర్తిరెడ్డి, మున్సిపల్ కమిషనర్లను కలిసి వినతి పత్రాలను అందజేశారు. జలమండలి వారి పైపులు తరచూ పగిలిపోతుండటంతో నీటి సరఫరా వారంలో ఒక రోజు మాత్రమే అవుతుందన్నారు. అలాంటి పరిస్థితి వచ్చినపుడు మున్సిపాలిటీ తరపున నీటిని సరఫరా చేస్తే ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. వినతి ఇచ్చిన వారిలో నరేష్, శివకుమార్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో లోటుపాట్లు రానివ్వొద్దు


పనులను పరిశీలిస్తున్న కమిషనర్ బి.శరత్‌చంద్ర

బండ్లగూడ: పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా సక్రమంగా నిర్వహించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. గురువారం కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్‌లలో తడి, పొడి చెత్త సేకరణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. కార్పొరేషన్‌లో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తరలించాలని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లను శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతి ఇంటి చెత్త ఆటో రిక్షా కార్మికులకు అందించేలా జవాన్లు, సూపర్‌వైజర్లు చర్యలు తీసుకోవాలన్నారు. వంద శాతం చెత్త సేకరించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, జవాన్లు, స్వచ్ఛ ఆటో డ్రైవర్లు, కార్మికులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ డే



మణికొండ: మణికొండలోని శ్రీచైతన్య పాఠశాలలో 'నేషనల్ సైన్స్ డే'ని (జాతీయ వైజ్ఞానిక దినోత్సవం) ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హార్వర్డ్ బిజినెస్ స్కూల్ సర్టిఫైడ్ స్ట్రాటజిస్ట్ కృష్ణసాగర్ రావు, ఎచ్.ఎమ్.టి. సీఈఓ చంద్రశేఖర్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల సృజనాత్మకతను వారు అభినందించారు. భౌతిక, రసాయన, జీవ శాస్త్రాల్లో 6 నుంచి 9వ తరగతుల విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులలో ఉత్తమమైన వాటిలో 18 ప్రాజెక్టులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ అనిత, వైస్ ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి, అకడమిక్ డీన్ జగన్‌మోహన్ రెడ్డి, సి బ్యాచ్ ఇన్‌చార్జ్ మస్తాన్, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పనిని ఆస్వాదిస్తేనే విజయం సొంతం

విశ్రాంత ఐఏఎస్ రాం పుల్లారెడ్డి


మాట్లాడుతున్న రాం పుల్లారెడ్డి

మణికొండ: మనం చేస్తున్న పనిని ఆస్వాదిస్తూ కృషి, పట్టుదలతో పనిచేసినప్పుడే ఉన్నత లక్ష్యాలను విజయం సాధిస్తామని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్, పంచాయతీ రాజ్ మాజీ డైరెక్టర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాంపుల్లారెడ్డి అన్నారు. గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కొనసాగుతున్న వార్షికోత్సవాల్లో రెండవ రోజు నిర్వహించిన క్రీడా దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువులపై దృష్టి పెట్టాలన్నారు. అభిరుచి, కృషి, ఆసక్తి కలిస్తే అవి శక్తివంతమైన ఫలితాలను ఇస్తాయన్నారు.

గౌరవ అతిథిగా హాజరైన అంతర్జాతీయ బాడీ బిల్డర్ రామకృష్ణ మాట్లాడుతూ.. సాధన చేస్తే విజయాలు సొంతమవుతాయన్నారు. ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన అనేక క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు, శృతి చైర్మన్ కృష్ణారెడ్డి, సహాయ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. రాజేశ్వరి, విద్యార్థి ప్రతినిధి సాయి వరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తే చర్యలు తప్పవు

రాజేంద్రనగర్: ప్రజా పంపిణీ బియ్యంతో వ్యాపారం చేస్తే కఠిన చర్యలు తప్పవని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా పంపిణీ బియ్యాన్ని పెద్ద ఎత్తున నిల్వ చేస్తున్నారన్న సమాచారం తమకు ఉందని స్క్రాప్ గిడ్డంగుల మధ్య రేషన్ బియ్యం దాచి రైళ్ల ద్వారా కర్ణాటక, మహారాష్ట్రకు తరలిస్తున్నారన్నారు. ప్రజా పంపిణీ బియ్యం మైలార్‌దేవ్‌పల్లి సరిసరాల్లో కొనుగోలు చేసి అక్రమ నిలువలకు కేరాఫ్ అడ్రస్‌గా టాటా నగర్ ప్రాంతాన్ని ఎంచుకుంటున్నారని పట్టుబడితే జైలు శిక్ష తప్పదన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అత్తాపూర్: చికిత్స పొందుతున్న గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ అత్తాపూర్ హెచ్‌ఎఫ్ ఫంక్షన్ హాల్ పిల్లర్ నంబర్ 248 వద్ద గత నెల 22న గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో పడి ఉంటంతో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు తెలిపారు.

నేడు శ్రీ చైతన్య టెక్నో స్కూల్ వార్షికోత్సవాలు

అత్తాపూర్: అత్తాపూర్ హైదర్‌గూడలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ వార్షికోత్సవ వేడుకలను ఈ నెల 1న (శుక్రవారం) చైతన్యోత్సవ-2024 పేరుతో నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అత్తాపూర్‌లోని ఎస్ఎస్‌సీ కన్వెన్షన్ హాల్లో ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమాన్ని ప్రారంభం అవుతుందని ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క తో పాటు మాజీ పార్లమెంట్ సభ్యురాలు విజయశాంతి, సినీ నటుడు కిరణ్ అబ్బవరం హాజరవుతారన్నారు.

మానవ సామర్థ్యాన్ని పెంపొందించడమే విద్య ఉద్దేశం

యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ జగదీష్‌కుమార్

రాయదుర్గం: విద్య యొక్క ఉద్దేశం మానవ సామర్థ్యాన్ని పెంపొందించడమేనని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ ఎం. జగదీష్‌కుమార్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ స్థాయి సదస్సు 'షేపింగ్ ది ఫ్యూచర్ ఆఫ్ ఎడ్యుకేషన్-2047' అనే అంశంపై జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానం-2020 కింద విద్యావ్యవస్థను మార్చడం ద్వారా స్థిరమైన, ఆరోగ్యకరమైన, శాంతియుతమైన, సురక్షితమైన భవిష్యత్తును వాస్తవికంగా రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఎన్ఐఓఎస్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ సరోజ్‌శర్మ భవిష్యత్తు విద్య కోసం దిశలను, సమగ్ర విక్షిత్ భారత్-2047 ఏజెండా గురించి వివరించారు. కార్యక్రమంలో ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్‌కే ఇష్తియాక్ అహ్మద్, పాల్గొన్నారు.

వీసీ, రిజిస్ట్రార్‌తో సమావేశమైన యూజీసీ చైర్మన్

ఉర్దూ విశ్వవిద్యాలయంలో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్, రిజిస్ట్రార్ ఇష్తియాక్ అహ్మద్‌తో యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ ఎం జగదీష్‌కుమార్ ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యూజీసీ నిధుల వినియోగం, మౌలిక వసతుల కల్పన, కోర్సులు, ఇతర అంశాల వివరాలను ఆయన వారిని అడిగి తెలుసుకున్నారు.

ఇంటింటికీ వెళ్లి చుక్కల మందు వేయాలి


మాట్లాడుతున్న డాక్టర్ సృజన

మైలార్‌దేవ్‌పల్లి: ఇంటింటికి వెళ్లి చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సృజన పేర్కొన్నారు.గురువారం మైలార్‌దేవ్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 3వ తేదీ నుంచి 5 వరకు పల్స్ పోలియో కార్యక్రమం ఉంటుందన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి, నార్సింగి, నర్కూడపెద్దషాపూర్ ,శేరిలింగంపల్లి, పీహెచ్‌లు ఉన్నాయని అన్ని బూత్‌లలో పోలియో చుక్కలు వేయాలన్నారు. 4, 5 తేదీలలో ఇంటింటికి తిరిగి సర్వే చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు స్వర్ణలత, రేఖ, శ్రీదేవి, పద్మ, దివ్యశ్రీ, వందన, స్వాతి సీహెచ్‌వో సిరాజుద్దీన్,హెచ్ఈసీ కేశవులు పాల్గొన్నారు.

నిరంతరం నిఘా

- దుర్గం చెరువు ప్రాంతంలో పోలీసు పహారా
- కేబుల్ బ్రిడ్జిపై ఐటీ పెట్రోలింగ్ సిబ్బంది పర్యవేక్షణ


దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జి


రక్షణ చర్యల్లో పోలీస్ సిబ్బంది (ఫైల్)

మాదాపూర్: దుర్గం చెరువుపై నిర్మించిన కేబుల్‌బ్రిడ్జిని సందర్శించేందుకు నగర వాసులు ఆసక్తిని చూపుతున్నారు. నగరవాసులే కాక ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు కేబుల్ బ్రిడ్జిపై సందడి చేసి హ్యాపీగా వెళుతున్నారు. ఈ క్రమంలో అక్కడ ప్రమాదాలను నివారించేందుకు పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఎక్కడా ఎలాంటి అఘాయిత్యాలు జరుగకుండా నిరంతరం నిఘా వేశారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు పోలీసులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు.

- కేబుల్‌బ్రిడ్జిపై సందర్శకులను రక్షణసిబ్బంది ప్రతిక్షణం గమనిస్తుంటారు.
- సందర్శకులు ఎక్కువసేపు అక్కడ నిలబడకుండా ఐటీ పెట్రోలింగ్ 24 గంటలు కేబుల్‌బ్రిడ్జిపై తిరుగుతూనే ఉంటుంది.
- లేక్ పోలీస్‌స్టేషన్‌లో నలుగురు సిబ్బంది, ఒక ఎస్ఐ ఎప్పుడూ విధుల్లో ఉంటారు.
- నాలుగు బైక్‌లు చుట్టూ తిరుగుతూ గమనిస్తుంటారు. అంతేకాక రిస్క్ చేసేందుకు ఒక స్పీడ్ బోటు ఏర్పాటు చేశారు.
- సందర్శకులు కేబుల్ బ్రిడ్జిపై వాహనాలను అక్కడే నిలిపి చూస్తుంటారు. అలాంటి వారిని ఎప్పటికప్పుడు పంపిస్తూ ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తుంటారు. ఇందులో ముగ్గురు విధులను నిర్వహిస్తున్నారు.
- పొరపాటున చెరువులో పడ్డ వారిని రక్షించేందుకు ఫైర్ సిబ్బందికి శిక్షణను ఇచ్చారు.

'వన్ టైమ్ స్కీమ్'ను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర


టీఐ, ఏఎంసీలతో సమావేశమైన డీసీ రవికుమార్

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ బచ్చలకూరి శరత్‌చంద్ర వెల్లడించారు. తెలంగాణ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జీవో నెంబర్ 101 ప్రకారం ఆస్తిపన్ను పేరుకుపోయిన బకాయి అపరాధ రుసుం 90 శాతం మాఫీతో కేవలం 10 శాతం అపరాధ రుసుం మాత్రమే చెల్లించేందుకు చివరి అవకాశం కల్పించడం జరిగిందన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆస్తిపన్ను చెల్లింపుదారులు పన్ను చెల్లించేలా వారిని ప్రోత్సహించడానికి వన్ టైమ్ స్కీమ్ కింద వారికి బకాయి ఉన్న వారికి 90 శాతం అపరాధ రుసుం మాఫీ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేయడం జరిగిందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మార్చి 31లోపు చెల్లించాలి..

మణికొండ: మున్సిపాలిటీల పరిధిలో పేరుకుపోయిన ఆస్తిపన్నులతో పాటు పెరిగిన వడ్డీల భారాన్ని తగ్గించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గొప్ప అవకాశాన్ని కల్పించిందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ కోరారు. మున్సిపాలిటీల పరిధిలోని గృహాలు, దుకాణాలకు ఇది వర్తిస్తుందని, వడ్డీపై 90 శాతం రాయితీ లభిస్తుందని, మార్చి 31లోపు కట్టిన వారికే ఈ అవకాశం వర్తిస్తుందన్నారు.

టీఐ, ఏఎంసీలతో సమీక్ష సమావేశం..

రాజేంద్రనగర్: ఆస్తిపన్ను బకాయిదారులు తమ ఆస్తిపన్నును కేవలం 10 శాతం అపరాధ రుసుంతో చెల్లించే సదవకాశాన్ని వినియోగించుకోవాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ సూచించారు. గురువారం సర్కిల్ కార్యాలయంలో ఆయన టీఐ, ఏఎంసీలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జీవో నంబర్ 101 ద్వారా ఆస్తిపన్ను చెల్లింపు 2022-23 అపరాధ రుసుం 90 శాతం మాఫీతో కేవలం 10 శాతం అపరాధ రుసుం మాత్రమే చెల్లించేందుకు చివరి అవకాశంగా కల్పించిందన్నారు. ఆస్తిపన్ను బకాయిదారులు తమ ఆస్తిపన్నును చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలన్నారు.

ఆస్తిపన్ను వసూళ్లలో భాగస్వాములవ్వాలి

బండ్లగూడ: ఆస్తిపన్ను వసూళ్లలో అందరూ భాగస్వాములవ్వాలని కమిషనర్ చరత్‌చంద్ర పేర్కొన్నారు.బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో గురువారం అన్ని విభాగాల అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ఆర్థిక సంవత్సరం చివరి మాసం కావడంతో అధికారులు, సిబ్బంది ఆస్తిపన్ను వసూళ్లపై దృష్టి సారించాలన్నారు.

మతసామరస్యానికి ప్రతీక గోల్కొండ

గోల్కొండ: శతాబ్దాల నుంచి గోల్కొండ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాదని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. ప్రముఖ సంఘ సేవకుడు, గోల్కొండ పీస్ అండ్ మైత్రి కమిటీ చైర్మన్ ఎస్.రాజువస్తాద్ గురువారం ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గోల్కొండలో మూడేళ్లుగా ఇన్‌స్పెక్టర్‌గా పని చేశానని, ఆ కాలంలో కులమతాలకు అతీతంగా ఎందరినో కలిశానని అన్నారు. మళ్లీ ఇక్కడికి ఏసీపీగా రావడం తన అదృష్టమని పేర్కొన్నారు. ఎస్.రాజువస్తాద్ మాట్లాడుతూ పీస్ అండ్ మైత్రి కమిటీ ఆవిర్భావం నుంచి గోల్కొండ పోలీస్‌స్టేషన్ సభ్యుడిగా తాను పని చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, పీస్ అండ్ మైత్రి కమిటీ అధ్యక్షుడు హబీబ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇలియాస్ అక్బర్ ఆలీ తదితరులు ఉన్నారు.


గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్‌తో ఎస్.రాజువస్తాద్

సమస్యల పరిష్కారానికి కృషి


చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్యకు పుష్పగుచ్ఛం ఇస్తున్న లక్ష్మీనారాయణ

అబిడ్స్: వాటర్‌వర్క్స్ ఉద్యోగులు, అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామనిచేవెళ్ల ఎమ్మెల్యే, వాటర్ వర్క్స్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ కాలె యాదయ్య అన్నారు. గోషామహల్‌లోని యూనియన్ కార్యాలయంలో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వాటర్‌వర్క్స్ ఉద్యోగులు, అధికారులకు తమ అసోసియేషన్ ప్రతినిధులు అందుబాటులో ఉండి అండగా నిలుస్తారన్నారు. నూతన కార్యవర్గ ప్రతినిధులను ఎమ్మెల్యే కాలె యాదయ్య, అలాగే అసోసియేషన్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆయనను ప్రతినిధులు సన్మానించారు. ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా జి.లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్‌గా బి.శంకర్ ప్రకాశ్, అధ్యక్షుడిగా డి.అశోక్, ప్రధాన కార్యదర్శిగా బి.నర్సింగ్‌రావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జి.సత్యనారాయణ, చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.అశోక్, ఎన్.మొగులయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎ.ఉదయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎం.ప్రేమ్‌కుమార్, జి.శంకర్, డి.యాదగిరి, జాయింట్ జనరల్ సెక్రటరీగా ఎన్.హన్మంత్‌నాయక్, బి.రాజాబాబు, కె.శ్రీనివాస్, కోశాధికారిగా ఎస్.రాజు, సలహాదారులుగా కొండల్‌రావు, సి.రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు తెలిపారు.